క్లుప్తంగా

క్షయ వ్యాధి నిర్మూలనకు కృషి చేద్దాం


క్షయ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ షైనాజ్‌బేగం

ఆదోని టౌన్: క్షయ వ్యాధిని పూర్తి స్థాయిలో తరిమి కొడదామని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ షైనాజ్‌బేగం అన్నారు. ఆదివారం పట్టణంలోని హవన్నపేట యూపీహెచ్‌సీలో కౌన్సిలర్ గౌస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం ఉన్నవారు, గళ్లలో తెమడ మరియు రక్తం పడడం, ఛాతీలో నొప్పి, ఆయాసం, శ్వాస ఆడకపోవడం, బరువు తగ్గడం, ఆకలి మందగించడం, శరీరంలో ఇతర భాగాల్లో వాపు, కణితలు లక్షణాల్లో ఏ ఒక్కటి ఉన్నా ప్రభుత్వ ఆసుపత్రిలో గళ్ల పరీక్ష చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు బాబురాజు, జ్ఞానేశ్వరి, సుబ్బమ్మబాయి, ఏఎన్‌ఎం పద్మ తదితరులు పాల్గొన్నారు.

27వ రోజుకు చేరిన మున్సిపల్ కార్మికుల సమ్మె


దీక్షలో కూర్చున్న కార్మికులు

ఆదోని టౌన్: ఆదోని మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె ఆదివారానికి 27వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా కార్మికులు పీరాసాహెబ్, సోమన్న, అహ్మద్, శరత్, కర్రెప్ప, కుమార్, శివశంకర్, భూకన్న, బషీర్, అల్తాఫ్, తదితరులు మాట్లాడుతూ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు ఏ ఒక్కరికీ తల్లికి వందనం పథకం జమ కాలేదన్నారు. ఈ విషయాన్ని కార్మికులు ప్రభుత్వానికి తెలిపినా పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న యునియన్ నాయకుడు

ఎమ్మిగనూరుటౌన్: తమ న్యాయమైన డిమాండ్లను సత్వరం ప్రభుత్వం పరిష్కరించాలని మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యునియన్ నాయకులు రాజేంద్ర, నారాయణ డిమాండ్ చేశారు. అదివారం మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు పట్టణంలో ప్రధాన రహదారుల మీదుగా ప్రభుత్వ తీరును నిరసిస్తూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం వద్ద 54వ రోజు కొనసాగిన దీక్షా శిబిరంలో వారు మాట్లాడుతూ ఇంజనీరింగ్ విభాగంలో టెక్నికల్ కార్మికులకు రూ.29,200లు, నాన్‌టెక్నికల్ కార్మికులకు రూ.24,500లు నెలసరి వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

నివాళి


సంతాపం వ్యక్తం చేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వై.ప్రదీప్‌కుమార్‌రెడ్డి

మంత్రాలయం : మండల కేంద్రానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు మద్రిరాజు భార్య మారతమ్మ అనారోగ్యం ఆదివారం చనిపోయారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వై.ప్రదీప్‌కుమార్‌రెడ్డి ఆమె మృతదేహానికి పూల మాలలు వేసి నివాళి ఘటించి సంతాపం వ్యక్తం చేశారు. అంత్యక్రియల కోసం ఆర్థిక సాయం అందజేశారు. ఆ కుటుంబానికి అండగా ఉంటామని కుటుంబ సభ్యులకు భరోసానిచ్చారు. ఆయనతోపాటు సర్పంచు తెల్లబండ్ల భీమయ్య ఉన్నారు.

దేవరగట్టులో భక్తిశ్రద్ధలతో పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న పూజారి

హొళగుంద: దేవరగట్టులో ఆదివారం మాళ మల్లేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. స్థానికులే కాకుండా కర్ణాటక తదితర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. పూజారులు మూల విరాట్‌లకు సుప్రభాత సేవ, అభిషేకాలు, బండారార్చన, కుంకుమార్చన, మహా మంగళ హారతి, నైవేద్యం సమర్పణ శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆస్పరి మఠంలో అన్నదానం చేశారు.

భక్తిపారవశ్యం..

రేణుకాయల్లమ్మ ఉత్సవం

- రేపటి నుంచి రేణుకాయల్లమ్మవ్వ ఆషాఢమాన ఉత్సవాలు
- నాలుగు మంగళవారాలు భక్తులకు పండుగ
- 22వ తేదీన జాతరతో ముగింపు


కొండలో వెలిసిన యల్లమ్మవ్వ ఆలయం(ఇన్‌సెట్)ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న రేణుకాయల్లమ్మవ్వ

ఆదోని అర్బన్: ఆషాఢమాసమంతా ఆదోని రేణుకాయల్లమ్మవ్వ భక్తులకు పండగే. పట్టణశివారులోని దొడ్డనగేరి రోడ్డులో వెలిసిన శ్రీ రేణుకాయల్లమ్మ ఆషాఢమాసోత్సవాలు ఈ మంగళవారం నుంచి వైభవంగా ప్రారంభమవుతున్నాయి. ఆషాఢ మాసం పూర్తి అయ్యేంతవరకు ప్రతి మంగళవారం మాతా ఆలయంలో వేలాది మంది భక్తులతో సందడిగా మారుతుంది. ఆలయంలో మాతకు ప్రత్యేక పూజలు జరుగుతాయి.

అమ్మవారి గంపజాతర

రేణుకాయల్లమ్మవ్వకు ఆషాఢంలో నాలుగు మంగళవారాలు వస్తాయి. మొదటి మంగళవారం 1వ తేదీన, రెండో మంగళవారం 8వ తేదీన, మూడో మంగళవారం 15వ తేదీన గంపజాతర, నాలుగో మంగళవారం 22వ తేదీన జాతరతో ముగింపు ఉత్సవాలు జరుగుతాయి. గంపజాతర రోజున భక్తులు పిండివంటలు చేసి అమ్మవారికి నైవేద్యం సమర్పిస్తారు. ముగింపు ఉత్సవాల రోజున పిండివంటలతో పాటు మాంసాహారం కూడా మాతకు నైవేద్యంగా సమర్పించడం సంప్రదాయంగా వస్తోంది.

భక్తి పారవశ్యం...

తూర్పు, పశ్చిమ దిశలో ఎతైన కొండలు, పచ్చని చెట్ల మధ్య పశ్చిమ కొండల్లో రేణుకాయల్లమ్మవ్వ ఆలయం నిర్మించారు. వాతావరణం ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుంది. ప్రతి మంగళవారం భక్తులు ఇంటిల్లిదిపాది ఆలయానికి వెళ్లి అవ్వవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పిస్తారు. అనంతరం పచ్చని చెట్ల మధ్య నైవేద్యం, ప్రసాదంతో పాటు వెంట తీసుకెళ్లిన పిండి వంటలను ఎంతో ఆనందంతో ఆరగిస్తారు. అనంతరం లింగ వయోబేధంతో సంబంధం లేకుండా ఆటపాటలతో ఆనందంగా గడుపుతారు. సాయంత్రం ఇంటికి చేరుకుంటారు. గంపజాతర, ముగింపు ఉత్సవాల రోజున పట్టణం నుంచే గాక కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు రేణుకాయల్లమ్మవ్వను దర్శించుకోవడానికి వస్తారు. కొంత ప్రాంతమంతా ఇసుక వేస్తే రాలనంతగా కనిపిస్తుంది.

భక్తులకు అన్ని ఏర్పాట్లు

ఆషాడమాసం ఉత్సవాల్లో పాల్గొనే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ధర్మకర్తలు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆషాఢమాసంలో యల్లమ్మ ఉత్సవాలు నాలుగు వారాల పాటు భారీగా జరగనున్నాయి. మూడో వారం గంపజాత, నాలుగో వారం మహాజాతర వేడుకలు జరుగుతాయి. 3, 4 వారాల్లో భక్తులకు ఆలయ తరపున ఆలయ ధర్మకర్తలు అన్నదానం ఏర్పాటు చేస్తున్నారు. భక్తులకు మండపాలు, మరుగుదొడ్లు, రోడ్ల మరమ్మతులు అన్ని సౌకర్యాలు కల్పించారు. నాలుగో మంగళవారం తెలంగాణ, మహారాష్ట్ర, ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి భారీ ఎత్తున భక్తులు రానుండడంతో దర్శనానికి బారికేడ్లు ఏర్పాటు చేశారు.

చారిత్రక నేపథ్యం..

ఆలయం ఎంతో పురాతనమైనదని, ఆలయానికి చారిత్రక నేపథ్యం ఉందని ఆలయ ధర్మకర్త మోహన్‌ప్రసాద్ చరిత్రను వివరించారు. త్రేతాయుగంలో జమదాగ్ని అనే మహారుషి కర్ణాటక రాష్ట్రంలోని సౌదత్తి సమీపంలోని రాంశృంగ అనే ప్రాంతంలో మలప్రభ నదీ సమీపంలో నివాసం ఉండేవాడు. ఆయన బ్రహ్మచారి, ఎంతో కోపిష్టి. యజ్ఞ అనే మహారాజు ఆధ్యాత్మిక చింతనలకు సంబంధించిన అంశాలపై మునులకు పోటీలు నిర్వహించాడు. పోటీలో జమదాగ్ని తమ ప్రతిభను చాటాడు. ప్రతిభావంతుడైన జమదాగ్ని మునీశ్వరుడిని తాను వివాహమాడతానని యజ్ఞ మహారాజు ఏకైక కూతురు రేణుకాయల్లమ్మ పట్టుబడుతుంది. అయితే ఇందుకు జమదాగ్ని నిరాకరిస్తాడు. అనంతరం రేణుకాయల్లమ్మ గురువు అయిన దిగస్త్య మహాముని సూచన మేరకు జమదాగ్ని వివాహమాడతాడు. వారికి ఐదుగురు సంతానం. వాసు, విశ్వవాసు, బృహధ్యాను, బృత్వాకన్వ, రాంభద్రగా నామకరణం చేశారు. చివరి సంతానమైన రాంభద్ర శివపార్వతుల భక్తుడు. వారి వరంతో ఆయన పరశురామ్‌గా మారాడు. జమదాగ్ని మహామునీశ్వరుడు మహాయజ్ఞాన్ని ప్రారంభిస్తాడు. ఆ యజ్ఞానికి ప్రతిరోజు మడితో మట్టికుండలో మలప్రభ నది నుంచి పవిత్ర జలాలు తీసుకొచ్చి దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించే బాధ్యతను భార్య రేణుకాదేవికి అప్పగిస్తాడు. అయితే రేణుకాయల్లమ్మను పరీక్షించేందుకు లక్ష్మి, విష్ణువు మారువేశంలో ప్రేమికులుగా నటిస్తారు. దీంతో రేణుకాయల్లమ్మ మనస్సు చలించడంతో పవిత్ర జలాలు ఉన్న మట్టికుండ ముక్కలవుతుంది. దీంతో ఉగ్రడైన జమదాగ్ని తల్లి శిరస్సును ఖండించాలని ఐదుగురు కుమారులను ఆదేశిస్తాడు. అయితే ఇందుకు నలుగురు నిరాకరించడంతో తన ఆజ్ఞ శోత్రాలతో వారిని బూడిద చేస్తాడు. చిన్న కొడుకు పరశురామ్ మాత్రం ముందుకొచ్చి తల్లి రేణుకాయల్లమ్మ శిరస్సును తన కత్తితో ఖండిస్తాడు. శిరస్సు ఎగిరి ఆదోని రాంజల కొండలో పడగా, మిగిలిన భాగమంతా సౌదత్తిలో ఉండిపోయిందని ప్రతీతి. కొడుకు పరశురామ్ భక్తికి మురిసిపోయిన జమదాగ్ని మూడు వరాలు కోరుకోవాలని కుమారుడికి సూచిస్తాడు. మొదటి, రెండో కోరిక తల్లికి, సోదరులకు తిరిగి ప్రాణాలు పోయాలని కోరుతాడు. ఇందుకు సమ్మతించిన తండ్రి వారికి ప్రాణాలు పోస్తాడు. నలుగురు సోదరులు చేతకాని వారు కావడంతో వారు జోగినులుగా బతుకుతారని చెప్పాడు. జోగినుల వ్యవస్థ ఆనాటి నుంచి మొదలైనట్లు చరిత్రకారులు చెబుతారు. మొండం పడిన సౌదత్తిలోనూ, తల పడిన ఆదోనిలోనూ రేణుకాయల్లమ్మవ్వకు ఆలయాలు వెలిశాయి. ఆలయాల్లో నాటి నుంచి సౌదత్తి, ఆదోనిలో ఆషాఢమాసంలోనే రేణుకాయల్లమ్మవ్వ మాతకు ప్రతి మంగళవారం ప్రత్యేక ఉత్సవాలు జరుగుతాయని ఆలయ ధర్మకర్త తెలిపారు. మూడో కోరిక తనకు అవసరమైనప్పుడు అడుగుతానని తండ్రి జమదాగ్నికి పరశురాముడు చెబుతాడని తెలియజేశారు.

కష్టజీవులకు అండగా సీపీఐ


మాట్లాడుతున్న సీపీఐ మండల కార్యదర్శి కల్లుబావి రాజు

ఆదోని రూరల్: కష్టజీవులకు అండగా సీపీఐ నిలుస్తుందని ఆ పార్టీ మండల కార్యదర్శి కల్లుబావి రాజు అన్నారు. ఆదివారం మండలంలోని దొడ్డనకేరి గ్రామంలో సీపీఐ జెండా శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా జెండాను ఎగురవేశారు. ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు, నిరుద్యోగ సమస్య, వ్యవసాయ కార్మికుల పని దినాల కోసం, మహిళలపై జరుగుతున్న దాడులు, అఘాయిత్యాలకు వ్యతిరేకంగా సీపీఐ పోరాటాలు చేస్తోందన్నారు. ఎన్నికల సమయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కొత్తూరు గంగన్న, ఏఐటీయూసీ నాయకులు వెంకన్న, రైతు సంఘం ఆయకులు మదిరె ఎల్లప్ప, ఉరుకుందు, నాగరాజు, ఈరన్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కురువలను చిన్నచూపు చూస్తున్న టీడీపీ


కురవ వీరేష్

కౌతాళం: కురువ కులస్తుల్ని మంత్రాలయం టీడీపీ అధిష్టానం చిన్న చూపు చూస్తోందని కురవ సంఘం జిల్లా కార్యదర్శి, కౌతాళం మండల కురవ సంఘం అధ్యక్షుడు వీరేష్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 7సహకార సంఘాల సొసైటీలు ఉన్నా కురువలకు ఒక్క అధ్యక్ష పదవి కూడా ఇవ్వకుండా అవమానపరిచిందన్నారు. నియోజకవర్గంలో 30 నుంచి 35వేల ఓట్లు ఉన్న వారిని నామినేటెడ్‌పోస్టులకు అర్హత కల్పించకుండా చిన్న చూపు చూడడం తగదన్నారు. గత ప్రభుత్వ పాలకులు కురువలకు సముచిత స్థానం కల్పించి మండల స్థాయి, నియోజకవర్గ స్థాయి, రాష్ట్రస్థాయిల్లో కూడా పదవులను కల్పించారని గుర్తుచేశారు. ఇప్పుడున్న మంత్రాలయం టీడీపీ పెద్దలు దీనిని గుర్తుంచుకోవాలన్నారు. తనకు కౌతాళం సింగల్ విండో డైరెక్టర్‌గా అవకాశం కల్పించారని, అయితే టీడీపీ నేతల తీరుకు నిరసనగా ఆ పదివిని తీసుకోవడం లేదన్నారు.

శ్మశాన వాటికలో ముళ్ల పొదల తొలగింపు


జేసీబీతో ముళ్ల పొదలను తొలగిస్తున్న గ్రామస్తులు

కోసిగి : మండల కేంద్రం కోసిగిలోని హిందూ శ్మశాన వాటికలో పేరుకుపోయిన ముళ్ల పొదల తొలగింపునకు చర్యలు చేపట్టారు. గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఆదివారం గ్రామస్తుల ఆర్థిక సహకారంతో జేసీబీని ఏర్పాటు చేసి శ్మశాన వాటికలో ఏపుగా పేరుకుపోయిన ముళ్ల పొదలను తొలగించారు. గతంలో చాల ఏళ్లుగా ముళ్ల పొదలు పెరిగి పోవడంతో శవాలను పూడ్చడానికి ఇబ్బందులు పడేవారన్నారు. పలుమార్లు ప్రభుత్వాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎవ్వరూ పట్టించుకోక పోవడంతో గ్రామస్తుల సహకారంతో క్లీన్ చేసుకున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. ప్రభుత్వం స్పందించి స్మశాన వాటిక చుట్టూ కాంపౌండ్ వాల్‌ను ఏర్పాటు చేసి వీధిలైట్లు ఏర్పాటు చేయాలని గ్రామ పెద్దలు కోసిగయ్య, వెంకటేశ్వర్లు, రామప్ప, వీరస్వామి, తిమ్మప్ప, గోవింద, బసవరాజు తదితరులు కోరారు.

దివ్యాంగులను ఇబ్బంది పెడుతున్న సర్కారు


దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు వాల్మీకి రామాంజనేయులును సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ దివ్యాంగుల సంఘం నాయకులు

ఆదోని రూరల్: కూటమి ప్రభుత్వం వికలాంగులను సర్వే సాకుతో రాష్ట్రంలో, జిల్లా వైద్య కేంద్రాల చుట్టూ తిప్పుతూ అనేక ఇబ్బందులకు గురి చేస్తుందని వైఎస్సార్‌సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు వాల్మీకి రామాంజనేయులు అన్నారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం దివ్యాంగుల ముఖ్య నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా దివ్యాంగుల జిల్లా అధ్యక్షుడు వాల్మీకి రామాంజనేయులు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ నూతన ప్రభుత్వం వచ్చాక వికలాంగులకు ఒక్క పింఛన్‌ను కూడా ఇవ్వలేదన్నారు. ఉన్న పింఛన్లను తీసివేయడం జరిగిందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ప్రతినెలా సదరం స్లాట్ బుక్ చేసుకోవడానికి అవకాశం ఇచ్చేదని, సదరం క్యాంపులో అర్హులైన వికలాంగులందరికీ సర్టిఫికెట్ ఇచ్చి, పింఛన్ మంజూరు చేసేదన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు పి.హనుమంతరెడ్డి, ఎమ్మిగనూరు నియోజకవర్గ అధ్యక్షుడు లక్ష్మినారాయణయాదవ్, పత్తికొండ అధ్యక్షుడు వీరాంజనేయులు, ఆదోని మండలాధ్యక్షుడు దుగ్గప్ప, సభ్యులు పాల్గొన్నారు.


ఉపాధ్యాయుడు గోవిందరెడ్డితో పూర్వ విద్యార్థులు

అ'పూర్వ' కలయిక

పెద్దకడబూరు : మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో 1986 – 87 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం పాఠశాలలో కలుసుకున్నారు. పూర్వ విద్యార్థులందరూ కుటుంబసభ్యులతో పాటు హాజరయ్యారు. వారి సంతోషాలను, బాధలను, కష్టాలను ఒకరితో మరొకరు పంచుకున్నారు. మధ్యాహ్నం భోజనం అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయుడు గోవిందరెడ్డిని పూలమాలలతో సత్కరించి గ్రామంలో డప్పు వాయిద్యాల నడుమ ఊరేగించారు.

యువతి ఆత్మహత్య


మృతిచెందిన సాయిలక్ష్మి

ఆదోని అర్బన్: కుట్టు మిషన్ నేర్చుకో అన్నందుకు మనస్తాపానికి గురై ఆదివారం ఇంట్లో ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకుని యువతి మృతిచెందిన ఘటన అంబేడ్కర్ కాలనీలో చోటు చేసుకుంది. మృతురాలి బంధువులు, ఔట్‌పోస్టు కానిస్టేబుల్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని అమరావతినగర్‌కు చెందిన హుసేనప్ప, శంకరమ్మ దంపతుల మూడో కుమార్తె సాయిలక్ష్మి(20) కుట్టుమిషన్ నేర్చుకో అన్నందుకు మనస్తాపానికి గురయ్యిందని తెలిపారు. సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో చున్నీతో ఉరి వేసుకుంది. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను ఆదోని ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి బంధువులు తరలించారు. అయితే అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఔట్‌పోస్టు కానిస్టేబుల్ తెలిపారు.

హామీల అమలులో సీఎం చంద్రబాబు విఫలం



స్వాతంత్ర్యోద్యమ నాయకుల వేషధారణలో సీపీఐ శ్రేణులు, మాట్లాడుతున్న రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామచంద్రయ్య

ఎమ్మిగనూరుటౌన్: అధికారం చేపట్టి ఏడాదైనా ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో సీఎం చంద్రబాబునాయుడు పూర్తిగా విఫలమయ్యారని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామచంద్రయ్య అన్నారు. ఆదివారం పట్టణంలో సీపీఐ నియోజకవర్గ మహాసభను స్థానిక కుర్ణికళ్యాణ మండపంలో నిర్వహించారు. ఇందులో భాగంగా స్వాతంత్ర్య సమరయోధులు, హిందూ, ముస్లిం వేషధరణలో వందలాది మంది ఆ పార్టీ శ్రేణులు, ఎర్రజెండాలతో ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి బయలు దేరి సోమప్ప సర్కిల్ మీదుగా కుర్ణికళ్యాణ మండపం వరకుపెద్ద ఎత్తునా ర్యాలీ చేపట్టారు. మండల నాయకుడు రాజీవ్ అధ్యక్షతన జరిగిన మహాసభలో ఆయన సీపీఐ ఆవిర్భావం గురించి వివరించారు. రాష్ట్రంలో పెండింగ్ ప్రాజెక్ట్‌లు పూర్తి చేయాలని ఉచిత బస్సు ప్రయాణం, 40 సంవత్సరాల్లోపు ప్రతి మహిళకు నెలకు ఇస్తామన్న రూ.15వేలు సత్వరం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెండగ్‌లో వున్న వేదావతి, గుండ్రేవుల ప్రాజెక్ట్‌లను పూర్తి చేసి జిల్లాలో వ్యవసాయానికి సాగునీరందించాలన్నారు. ఇలాంటి పెండింగ్ ప్రాజెక్ట్‌లు పూర్తి చేయక కూటమి ప్రభుత్వం గోదావరి నదిజలాలతో బనకచర్ల ప్రాజెక్ట్‌ను రూ.82వేల కోట్లతో నిర్మిస్తామని చెప్పడం అవివేకమన్నారు. మహాసభలో సీపీఐ నాయకులు రంగన్న, పంపణ్ణ గౌడ్, భాస్కర్ యాదవ్, విరూపాక్షి, జబ్బార్, దాదావలి, తిమ్మాపురం సర్పంచ్ మహేశ్వరమ్మ, ఏఐటీయూసీ నాయకులు వీరేష్, విజయేంద్ర, తిమ్మగురుడు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తాం


ఫుట్‌బాల్ క్రీడాకారులతో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బుట్టా శివనీలకంఠ

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో ఫుట్‌బాల్ క్రీడ, క్రీడాకారులకు ప్రోత్సాహం అందించేందుకు బుట్టా ఫౌండేషన్ ద్వారా కృషి చేస్తామని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, బుట్టా ఫౌండేషన్ అధినేత బుట్టా శివనీలకంఠ అన్నారు.ఆదివారం పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఎమ్మిగనూరు ఫుట్‌బాల్ అసోసియేషన్ సభ్యులు ఆయనను సత్కరించి ఫుట్‌బాల్ క్రీడాభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో ఫుట్‌బాల్ కోచ్ మాబుసాహెబ్, అసోసియేషన్ నాయకులు పాలశ్రీనివాసరెడ్డి, విశ్వనాథ్ రమేష్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి సునీల్‌కుమార్, పట్టణ ఉపాధ్యక్షుడు కోటకొండ నరసింహుడు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆయకట్టు రోడ్డు కాదు !


పొదలకుంట-హాల్వి గ్రామాల మధ్య దెబ్బతిన్న రోడ్డు

కౌతాళం: మండలంలో ఆర్‌అండ్‌బీ రహదారులు ఆయకట్టు రోడ్డులను తలపిస్తున్నాయి. పొదలకుంట నుంచి హాల్వి వరకు ఉన్న రోడ్డు అధ్వానంగా తయారైంది. కంకర తేలి గుంతలు పడి ఆయకట్టు రోడ్డును తలపిస్తుంది. ఈ రోడ్డుపై ఇసుక ట్రాక్టర్లు, లారీలు తిరుగుతుండడంతో పూర్తిగా దెబ్బతింది. సంవత్సరం కాలం నుంచి ఈ రోడ్డుకు ఎలాంటి మరమ్మతులు చేపట్టక పోవడం కూడా ఒక కారణమే. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కౌతాళం నుంచి హాల్వి వరకు ఉన్న 14కిలోమీటర్ల రోడ్డులో కౌతాళం నుంచి సుళేకేరి వరకు 8కిలోమీటర్లు రోడ్డును వేశారు. పొదలకుంట నుంచి హాల్వి వరకు రోడ్డు పూర్తిగా దెబ్బతినగా ప్రస్తుత ప్రభుత్వం రోడ్డు కాదు కదా కనీసం మరమ్మతులు కూడా చేయకపోవడంతో అస్తవ్యస్తంగా తయారైంది. అధికారులు స్పందించి ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

మురుగుతో స్వాగతం!


చూడి గ్రామం ముఖద్వారంలోనే మురుగునీటితో దర్శనం


రోడ్డు పొడువునా ఇలాంటి దృశ్యాలే

కౌతాళం: మండల పరిధిలోని చూడి గ్రామంలో ముఖద్వారం వద్ద మురుగు నీరు స్వాగతం పులుకుతోంది. ఈప్రాంతంలో ఉన్న కాలనీలోని ఇళ్ల నుంచి వచ్చే మురుగు నీరంతా రోడ్డుపై నిలుస్తుండడంతో దర్గంధం వెదజల్లుతోంది. ఈ మురుగు నీరు గ్రామంలోకి ప్రవేశించే రోడ్డుపై పారి పొలాల వెంట వెళ్తాయి. గ్రామంలోకి ప్రవేశించాలంటే మురుగు నీరు దాటుకొని పోవాల్సిన పరిస్థితి. గ్రామంలో సరైన డ్రైనేజి వ్యవస్థ లేకపోవడంతోనే ఇలాంటి సమస్య నెలకుందని గ్రామస్తులు తెలిపారు. గ్రామం ముఖ ద్వారం వద్ద పరిస్థితి ఇలా ఉంటే గ్రామంలో పల మరీ అధ్వానంగా ఉందని గ్రామస్తులు తెలిపారు. కనీసం జేసీబీతో రోడ్డుకు ఇరువైపులా కాలువ తవ్వితే మురుగు నీరు అందులో పోతాయని, ఆ దిశగా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.